


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### పుట్టినరోజు

**శోభారాణీ, టి.పి హేమమాలినీ**, సాజీదా, ఎస్తేర్ అంతా ఇంటర్వెల్‌లో వచ్చి స్కూల్లో "ఏ.వీ రమణీ నీ పక్కన రేపు నేను కూర్చుంటా" అని చెప్పి వెళ్ళారు.

ఎందుకంటే ఆ ఒక్కరోజూ నేను కిరీటం లేని విక్టోరియా మహారాణిని. నన్ను టీచర్స్ ఏమీ అనరు. పైగా ఆ రోజు రిపబ్లిక్ డే. క్లాసులో జ్యోతీ మిఠాయి బండార్ చిక్కడపల్లి వాళ్ళు స్పాన్సర్ చేసిన మిఠాయి బూంది పంచి పెడ్తారు. నాకు రెండు పాకెట్స్ ఇస్తారు. అందరికీ ఒకటే ఇచ్చి. పైగా నేను రంగు రంగుల చాక్లెట్స్ బాక్స్‌లోంచి తీసిన 'న్యూట్రిన్' చాక్లెట్స్ మా స్కూల్ డ్రెస్ గ్రీన్‌లో వున్న రేపర్ వున్నవి పంచి పెడ్తాను. అందరికీ ఇచ్చాక పక్కన వాళ్ళకి ఒకటో రెండో ఇవ్వనూ వచ్చు. అందుకే అలా అందరూ అడుగుతారు.

కానీ సందానీ మాత్రం "నాకు నాలుగు చాక్లెట్స్ ఇవ్వు. నాకీ తమ్మునికీ, చెల్లికీ, అమ్మీ జాన్‌కీ భీ ఇస్తా" అన్నాడు.

వాడెంత కోతి అల్లరి చేసినా, ప్రతి పరీక్షలో 'పూర్ణ చంద్రుడి'నే తెచ్చుకుంటున్నా, బాధ్యతగా వుంటాడు. అందుకే వాడంటే నాకిష్టం.

అమ్మ ముందు రోజు ఆఫీస్ నుండి తొందరగా వచ్చి చిక్కడపల్లిలో రెడీమేడ్ షాప్‌కి తీసుకెళ్ళి 'నీ కిష్టమైన గౌన్ కొనుక్కో' అంటుంది. అప్పట్లో సిల్క్ గౌన్లు కింద కుచ్చులతో నిజంగా రాజకుమార్తెలా ఫీల్ అయ్యేటట్లు వచ్చేవి. ఆరెంజ్ కలర్ గౌను వేసుకుని నడుస్తుంటే, సృష్టిలో వున్న ప్రతి ఒక్కటీ వంగి నాకు సలాం పెట్టి దారి ఇస్తున్నట్లు అనిపించేది. రోజూ బెత్తం పట్టుకుని టీచర్ ఆట ఆడేటప్పుడు, నా దెబ్బలు పడ్డ ఇమేజినరీ స్టూడెంట్స్, కనకాంబరం మొక్కా, గన్నేరు మొక్క, నంది వర్ధనం, డిసెంబరాలూ, జామా, సపోటా, మామిడి వృక్షాలూ.. అన్నీ ఆ రోజు కల్మషం కడుపులో పెట్టుకోలేని చిరునవ్వు నవ్వుతుంటే, ఒక్కొక్క మొక్కనీ, చెట్టునీ కౌగలించుకుని "ఈ రోజు నా పుట్టిన రోజు తెలుసా? జనవరి 26న

పుట్టాను. దేశం అంతా నా పుట్టిన రోజు జరుపుకుంటుంది" అని చెప్పేదాన్ని. అవన్నీ ఆనందంగా తలలూపేవి. మల్లెపూలు దొరక్కపోతే కనకాంబరాలు నా తలలో పెట్టేది అమ్మ. తలంటుకున్న జుట్టు ఎర్ర రిబ్బన్‌తో కట్టి, పోనీ టెయిల్ వదిలెయ్యడం అప్పటి ఫ్యాషన్. ఇప్పట్లా కాదు. ఒట్టి రోజుల్లో జడ అల్లుకోకపోతే అమ్మమ్మ బెత్తం తీసుకునేది. అమ్మ కనీకనిపించనట్లు బ్యూటీ స్పాట్ అని గెడ్డం కింద చుక్క పెట్టేది. అసలు భయం అల్లా దిష్టి తగులుతుందేమోనని.. అప్పుడు ఇవన్నీ తెలిసేవి కావు. కానీ కాటుకతో చుక్క పెట్టి, దానిమీద దూదూగుగా పౌడర్ రాసి, బ్యూటీ స్పాట్ అంటే మురిసిపోయేదాన్ని.

అమ్మమ్మ పరవాన్నం చేసేది. సేమ్యా పాయసాన్ని కూడా అలాగే అనేది. నాకు ఇప్పటికీ ఎవరి పుట్టిన రోజైనా పాయసం చేయడం అలవాటే. కొత్త శాండిల్స్, కొత్త రిబ్బన్లు, మెడలో కొత్త పూసల దండ, చేతులకి రబ్బర్ గాజులు, చెవులకి కొత్త రింగులు ఇవన్నీ కొనడం అమ్మ ఎప్పుడూ మర్చిపోలేదు. నా జీవితంలో పుట్టినరోజుని మరిచిపోలేని రోజు చేసినది అమ్మ. బహుశా నేను పుట్టడం అన్న విషయాన్ని అమ్మకూడా అంత సెలబ్రేట్ చేసుకునేదేమో.. ఆ రోజు మనం మహారాణీ. ఏం కూర వండను? దగ్గరనుండీ లేవగానే అన్నీ నన్నే అడిగేవారు. నేను కళ్ళు మూసుకుని ఆలోచించి "సుధా హోటల్" అనేదాన్ని. ఊరినుండి నాన్న వస్తే మాత్రం ఒక ఆటో ఎప్పుడూ వాకిట్లో వుండేది. ఆబిడ్స్ 'తాజ్'కి తీసుకెళ్ళి మసాలా దోశా, దాని తర్వాత 'బాసుందీ' ఇవి ఫిక్స్‌డ్. ఆయనకి అంత యిష్టం.

ఇంక కూరలలో వంకాయ రాజు అని ఆ దేవుడే కిరీటం పెట్టి పంపించేసాక, మనం ఏం అనగలం? గుత్తి వంకాయ.. అదీ అమ్మ వండిన గుత్తి వంకాయ స్వర్గానికి ఒక బెత్తెడు దూరం. అంతే. పొందిగ్గా అన్నీ వేయించి కారం కొట్టి, వంకాయల్లో కూరి, కుంపటిమీద పెట్టి, పైన నీళ్ళ మూత పెట్టి, అడుగు అంటకుండా మగ్గిస్తుంటే ఆ ఘుమఘుమకి పక్కింటివాళ్ళు "మీ ఇంట్లో గుత్తివంకాయా? మాకూ కొంచెం పంపరూ?" అని అడగాల్సిందే.

ఆ కాలంలో అలా అడిగేవాళ్ళం. శారదమ్మగారు చింతకాయ పచ్చడి పోపు వేస్తుంటే, "ఇదిగో కొంచెం ఆకులో పెట్టి ఇటివ్వండి అయ్యాక" అని పక్కింటి మావయ్యగారైనా అడగాల్సిందే. అలా వుండేవి ఆ వాసనలు. మేం ఆడుకుని, అలిసిపోయి దీపాలు పెట్టే వేళకి ఇంటికి వస్తూ, మా దోస్తులందరం "వీళ్ళ ఇంట్లో అరటికాయ వేపుడు, వాళ్ళు పప్పుచారు పెట్టుకుంటున్నారు, వీళ్ళు ఎండు చేపలూ, బొమ్మిడాయిలూ" అని అన్నీ వాసనలు పట్టే పోల్చి నవ్వుకునేవాళ్ళం.

అమ్మమ్మ " కాళ్ళు అయినా కడుక్కున్నారా? అడ్డమైన చోట్లా తిరిగొస్తారు" అనేలోగానే కంచం పెట్టుకుని "అన్నం పెట్టెయ్యి ఆకలి .. ఆకలి" అనేవాళ్ళం. వేడి వేడి బంగాళా దుంపల వేపుడూ, మరిగి మరిగి వున్న చారూ.. ఆ సాయింత్రాల్ని సువాసన భరితం చేసేవి . మా కంచాల్లో తెల్లని అన్నం పౌర్ణమి నాటి వెన్నెలలా మెరిసిపోతుంటే, ఏ పండు మిరపకారమో, కొత్తావకాయో వేస్తే, పక్కన హిమగిరి అంత చల్లగా వెన్న ముద్ద పెట్టేవారు. మధ్య తరగతి వాళ్ళయినా తిండి దగ్గర 'నో కాంప్రమైజ్' ఆ రోజుల్లో, ఎవరికీ స్కూటర్ అయినా స్వంత ఇల్లయినా వుండేది కాదుకానీ కడుపు నిండా రోజూ అన్నం మాత్రం తినేవాళ్ళం.

నాన్న ఆబిడ్స్ తాజ్ నుండి బ్యాక్ టు బ్యాక్ రెండు సినిమాలు చూపించిన రోజులెన్నో. అందులో 'రాధమ్మ పెళ్ళి.. కృష్ణవేణి' ఒకటే రోజుచూసినట్లు గుర్తు. అలాగే 'గౌరీ, నోమూ' కూడా. అలా నా మెదడ్లో, కడుపులో అరగించుకోలేనంత మేటర్ కుక్కడం అంత చిన్నప్పటి నుండే ఆరంభం అయిందన్నమాట అవన్నీ ఇలా ఇప్పుడు అక్షరాలై నా కాయితాల మీద పరుగెడుతుంటాయి.

స్కూల్లో హెడ్ మాస్టర్ 'ఈరోజు పుట్టిన రోజు పండుగ ఎవరిదీ?' అని ప్రేయర్ అప్పుడు స్టేజ్ మీదకి పిలిచి, అందరి చేతా క్లాప్స్ కొట్టించేవారు. అసలా పుట్టడం ఎంత గొప్ప విషయమో అన్నట్లుండేది ఆ రోజు. ఎప్పుడూ ధుమ ధుమలాడే హిందీ పండిట్ కూడా నా బుగ్గ పుణికి "జనం దివస్‌కీ ముబారక్.. అచ్చా పడో" అనేవాడు. నవ్వడం అయితే ఆయన ఎప్పుడో మరిచిపోయి వుంటాడులెండి పాపం.

తెలుగు పండిట్ నూకల సీతారామయ్యగారు "ఆయుష్మాన్ భవ! పుట్టినందుకు ఏదైనా గొప్ప పనులు చేసి అమ్మా నాన్నల పేరు నిలబెట్టండి" అని దీవించేవారు.

కుసుమ కుమారీ టీచర్ 'హూ! ఆడపిల్లలు ఈ స్కూల్‌లో వున్నప్పుడేనే ఆనందంగా వుండేది" అని దీర్ఘంగా నిట్టూర్చేది.

"దేవుడు నీకు మేలు చేస్తాడు" అనేది క్రీస్తుమణి టీచర్.

అమ్మమ్మ మనవలంటే మంచి పేరు తీసుకు రావాలి. ఎంత కష్టపడి పెంచుతోందో మిమ్మల్ని" అని హెడ్ మాస్టర్ జార్జ్ అనేవారు.

ఆయన నాగ్‌పూర్ వెళ్తూవుండగా మా రామూ అన్నయ్య డాక్టర్ అయ్యాక , వర్ధా స్టేషన్‌లో వచ్చి కలిస్తే ఎంత సంతోష పడిపోయారో.

చదువులో మా అన్నయ్యల పేరు నేను నిలబెట్టలేకపోయినా, ఆటల్లో, అల్లర్లలో మాత్రం వెనక్కి తగ్గేదాన్ని కాదు. చేతులకీ, చెవులకీ పూలు పెట్టేసి, శకుంతల వేషం వెయ్యాలన్నా 'బెగ్గర్ మెయిడ్' పోయెమ్ లో బెగ్గర్ మెయిడ్ వేషం వెయ్యాలన్నా నన్నే సెలెక్ట్ చేసేవారు. సందానీగాడితో కలిసి, స్కూల్ ప్రహరీ గోడ ఎక్కి, పక్కన రామక్రిష్ణా స్టూడియోస్‌లో జరిగే షూటింగ్ చూడాలన్నా, రాళ్ళు విసిరి చింతచెట్టునుండి కాయలు రాలగొట్టాలన్నా నేనే వుండేదాన్ని. అసలు క్లాసులో ఎక్కువ పనిష్మెంట్‌లు నాకే వచ్చేవి. సందానీగాడికైతే మోకాళ్ళకి షూస్ వేసుకుని నడవచ్చు, నీల్ డౌన్ చేసి అంతలా బండబారిపోయాయి.

ఇంక నా పుట్టినరోజు నాడు పొద్దుటే తలకి చమురు అంటి, బోలేడు తిట్లు "అత్తకడుపు చల్లగా... అమ్మ కడుపు చల్లగా... ఆ వచ్చేది ఎవరంటే అంకరాజు వారి అమ్మాయి, ఆవిడ కొడుకులు, కోడళ్ళూ, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనవలు,

మునిమనవలు.. కోడళ్ళ కోడి వై.. అల్లుళ్ళ అటకవై, మనవళ్ళ మందవై.." అంటుంటే నేను కిలకిలా నవ్వుతూ" ఇంకా తిట్టు అమ్మమ్మా" అనేదాన్ని. అవే తిట్లు.

ఇప్పుడు పుట్టినరోజు అంటే పిల్లలకీ, మనవడికీ నేనూ అవే తిట్లు, అవే పద్ధతులు. నూనె రాసి, ఒంటికి సున్నిపిండితో నలుగూ, కుంకుడుకాయలతో తలంటూ, తర్వాత సాంబ్రాణి ధూపం.. అహా! ఆ హాయికి కళ్ళు నిద్రతో సోలిపోయేవి. పసుపు పెట్టిన కొత్త వాసనతో కొత్త బట్టలూ, ఇష్టమైన సేమ్యా పాయసం, స్కూల్లో స్పెషల్ ట్రీట్‌మెంట్. ఇన్ని ప్రత్యేకతలుండేవి బాల్యంలో. కానీ ఆ పుట్టినరోజు ఫ్లేవర్ ఇప్పటిదాకా అలాగే స్పెషల్‌గా ఉంచిన నా తల్లికీ, తర్వాత నా భర్తకీ, ఇప్పుడు నా పిల్లలకీ, బుజ్జి మనవడికీ నేను కృతజ్ఞతజ్ఞురాలిని. అవన్నీ భగవంతుడిచ్చినవి అయితే.. స్నేహితులు.. వీళ్ళని నేను సంపాదించానా? లేదే ..

శివుడి ఆజ్ఞ లేనిదే చీమ అయినా కుట్టదంటారు. ఈ స్నేహితులు, అభిమానులమంటూ దగ్గరయి మనసుకి చుట్టుకుపోయిన చుట్టాలు.. వీళ్ళందరూ నా పుట్టినరోజుని చాలా చాలా స్పెషల్ చేస్తున్నారు. వీళ్ళందరికీ శతకోటి ధన్యవాదాలు. తెల్లవారు ఝామున మొదలయ్యే ఫోన్ కాల్స్, మెసేజ్‌లతో ఆరంభం అవుతుంది నా పుట్టినరోజు. అర్ధరాత్రి పన్నెండు దాటగానే చేసే ఓ ప్రత్యేక స్నేహితుడితో ఆ రోజంతా నేను స్పెషల్‌గా ఫీల్ అయ్యేటట్లు ఇన్నేళ్ళుగా చేస్తూనే వున్నారు.

నా అదృష్టాలు అన్నింటిలోకీ పెద్ద అదృష్టం మా అమ్మ 'కొత్త చీర' కొనడం. చిన్నప్పుడు చిక్కడపల్లి రెడీమేడ్ షాప్‌కి తీసుకెళ్ళి కొత్త గౌన్ల గరగరలలో, నా కళ్ళ మెరుపులు చూసిన అమ్మ ఇప్పటికీ 'నీ ఇష్టమొచ్చిన చీర కొనుక్కో' అని షాప్‌కి తీసుకెళ్ళి కొనిపెడుతుంది .చీర మనం కళ్ళతో చూస్తాం. అమ్మ వేళ్ళతో, అరచేత్తో చూసి "మెత్తగా మొగలి పొత్తులా వుంది. ఒంటికి హాయిగా వుండాలి, ఇది తీసుకో" అంటుంది. అలా ఇప్పటికీ అమ్మ కొన్న చీరే. నా కొడుకులు ఏ ఫైవ్ స్టార్ హోటల్‌కి తీసుకెళ్ళినా, ఎంత ఖరీదైన గిఫ్ట్స్ కొనిచ్చినా, ఒంటిమీద అమ్మ కొన్న చీరే వుంటుంది.

అమ్మకి ఇప్పుడు 86 ఏళ్ళు. ఆ దేవదేవుడు నాకీ భాగ్యం ఇంకో ఇరవై ఏళ్ళు అయినా అందించాలి. అమ్మ స్వయంగా నాతో షాప్‌కి వచ్చి కొని పెడ్తూనేఉండాలి.

మళ్ళీ మళ్ళీ ఇలాంటి పుట్టిన రోజులే కావాలి.

Post your comments

